TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 197 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.11.02.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

రిపోర్టర్లు కావలెను

TGTEL/25/A1907 అమృత్ తెలంగాణ తెలుగు దిన పత్రిక

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న TGTEL/25/A1907 అమృత్ తెలంగాణ తెలుగు దిన పత్రిక

మీకు సరైన వేదిక... అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది.

ఇంకెందుకు ఆలస్యం

9849973404, 6304156955

వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

# నేడే పోలింగ్

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లోని 2,983 వార్డులకు బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతోంది. సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ పోలింగ్‌లో ఆ సమయానికి క్యూలైన్లలో ఉన్నవారందరికీ ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశం కల్పిస్తారు. జరగనున్న పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'కార్పొరేషన్లలో 414 వార్డులకు 2,225 మంది పోటీలో ఉన్నారు. 2 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మున్సిపాల్టీల్లో 2,582 స్థానాలకు 10,719 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, 12 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. ఒక వార్డులో ఎన్నిక వాయిదా పడింది. ఎన్నికల కోసం 8,188 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామనీ, 52,17,413 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. ఓటర్లలో 25,49,750 మంది పురుషులు, 26,67,025 మంది మహిళలు, 638 మంది ఇతరులు ఉన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 8,191 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తున్నారు. 1,379 మంది రిటర్నింగ్ అధికారులు, 41,773 మంది పోలింగ్ సిబ్బందిని ఈ ఎన్నికల నిర్వహణ కోసం నియమించారు. మంగళవారం డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల నుంచి ఎన్నికల సామాగ్రి తీసుకుని సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఫిబ్రవరి 16న వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం అదే రోజు మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికలు నిర్వహిస్తారు. ఏదైనా కారణం చేత ఎన్నిక వీలు కాకుంటే మరుసటి రోజు ఫిబ్రవరి 17న నిర్వహిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. ఓటర్లు ఓటరు గుర్తింపు కార్డుతో పాటు ఆధార్, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ సహా ఎన్నికల సంఘం గుర్తించిన 18 రకాల ఐడీ కార్డులను ఉపయోగించి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. పోలింగ్ జరిగే స్టేషన్ల పరిధిలో బీఎన్ఎస్ 163 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లందరూ స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా ఓటేయ్యండి" అని ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేసింది. ఫిర్యాదుల కోసం 92400 212456 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు. ఓటు ఆవశ్యకతను తెలిపే వీడియో, ఆడియో సందేశాలను ఎన్నికల సంఘం మంగళవారం విడుదల చేసింది.

'పెయిడ్ హాలిడే'

ఎన్నికలు జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల పరిధిలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ రోజును 'పెయిడ్ హాలిడే' (వేతనంతో కూడిన సెలవు)గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం కార్మిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్యాక్టరీలు, దుకాణాలు, వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక వాడల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులందరికీ సెలవు వర్తిస్తుందని తెలిపింది. తెలంగాణ ఫ్యాక్టరీస్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ (1974), తెలంగాణ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ (1988) ప్రకారం ప్రభుత్వం పెయిడ్ హాలీడేను ప్రకటించినట్టు వివరించింది. పోలింగ్ సజావుగా సాగేందుకు ఉద్యోగులకు సెలవు అమలయ్యేలా చూడాలని లేబర్ కమిషనర్, ఫ్యాక్టరీల డైరెక్టర్, అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. పోలింగ్ రోజున ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల పరిధిలో ఉన్న స్కూళ్లకు సెలవు ప్రకటించాలని ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఆ క్రమంలో పోలింగ్ జరగనున్న ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం



సెలవు ప్రకటించింది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజ్‌వల్ లీవ్ మంజూరు చేసింది.

కార్పొరేషన్లలో...

పోలింగ్ జరిగే కార్పొరేషన్లు : 07

మొత్తం వార్డులు: 414

ఏకగ్రీవమైన వార్డులు: 2

పోటీ జరగనున్న వార్డులు: 412

పోటీలో ఉన్న అభ్యర్థులు: 2,225

పోలింగ్ స్టేషన్లు : 2,174

మున్సిపాల్టీల్లో...

పోలింగ్ జరిగే మున్సిపాల్టీలు : 116

మొత్తం వార్డులు : 2,582

ఏకగ్రీవమైన వార్డులు: 12

వాయిదాపడ్డవి : 01

పోలింగ్ జరిగే వార్డులు : 2,569

పోటీలో ఉన్న అభ్యర్థులు: 10,719

పోలింగ్ స్టేషన్లు : 6,017

ఓటర్ల సంఖ్య ఇలా...

పురుషులు: 25,49,750

మహిళలు: 26,67,025

ఇతరులు: 638

# పురపోరుకు భారీ బందోబస్తు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో బుధవారం జరుగనున్న ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల పోలింగ్‌కు భారీ ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేశామని రాష్ట్ర డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల మాదిరిగానే మున్సిపల్ ఎలక్షన్స్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 4389 మంది రౌడీలు, గూండాలను బైండోవర్ చేశామనీ, 389 నాన్‌బెయిలబుల్ వారెంట్లను జారీ చేశామని ఆయన తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.3.09 కోట్లు విలువైన నగదు, మద్యం, మత్తు పదార్థాలు, గిఫ్టులను స్వాధీనపర్చుకున్నామన్నారు. ఇందులో రూ.1.29 కోట్లు నగదు ఉన్నదని తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా 1200కు పైగా లైసెన్స్‌గల ఆయుధాలను స్వాధీనపర్చుకొని పోలీసు స్టేషన్లలో డిపాజిట్ చేశామన్నారు. మొత్తం 8వేలకు పైగా ఉన్న పోలింగ్‌బూత్‌లలో 1308 అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్నట్టు గుర్తించామనీ, ఈ ప్రాంతాల్లో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లతో అదనంగా నిరంతర గస్తీని కూడా ఏర్పాటు చేశామన్నారు.

ఎన్నికల కమిషన్ నిర్దేశాల మేరకు పోలింగ్ స్టేషన్ల వెలుపల కూడా వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేసి మరింతగా నిఘాను పెంచామని తెలిపారు. పోలింగ్ బందోబస్తు కోసం ఆయా జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లు తమ పర్యవేక్షణలోని సివిల్, ట్రాఫిక్, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులను పూర్తిగా బందోబస్తుకు నియోగించారని తెలిపారు. వీరికి అదనంగా మరో మూడువేల మంది అధికారులు, సిబ్బందిని అటవీ, తూనికలు, కొలతలు, ఎక్సైజ్ విభాగాల నుంచి బందోబస్తుకు రంగంలో దించామని ఆయన వివరించారు. ఎన్నికల బందోబస్తుకు సంబంధించి గత 15 రోజులుగా ప్రస్తుతం డ్యూటీలో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇప్పించామని తెలిపారు. పోలింగ్ రోజు ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు.

ఓటుకు నోటు, ఫోన్‌ట్యాపింగ్ కేసులకు సంబంధించిన ఆధారాలు ఇప్పటికే సంబంధిత కోర్టులకు సమర్పించడం జరిగిందనీ, అవి ధ్వంసమైనట్టుగా వస్తున్న వార్తల్లో ఏ మాత్రమూ నిజం లేదని డీజీపీ ఒక ప్రశ్నకు జవాబిచ్చారు. అగ్ని ప్రమాదం జరిగిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లో ఉన్న పరిస్థితిని సమగ్రంగా అధ్యయనం చేసి తగిన సూచనలు ఇవ్వడానికి పూణేలోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు చెందిన నిపుణులు, నాగ్‌పూర్‌లోని ఆలిండియా ఫైర్ సర్వీసెస్‌కు చెందిన నిపుణులు వచ్చారనీ, వారి అధ్యయనం అనంతరం అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ ఎఫ్ఎస్ఎల్‌లో దగ్ధమైన కంప్యూటర్లలోని డేటాను తిరిగి సేకరించడానికి అవసరమైన చర్యలను నిపుణులు తీసుకుంటున్నారని చెప్పారు.గతంలోనే ఒకసారి ఇదే ల్యాబ్‌లో భారీ పేలుడు జరిగిన నేపథ్యంలో దేశంలోనే ప్రతిష్టాకరమైన ఈ ల్యాబ్‌ను సురక్షితంగా ఉంచడానికి తగిన జాగ్రత్తలు తీసుకోలేదా అనే ప్రశ్నకు అన్ని కోణాల నుంచి ఈ ప్రమాదాన్ని పరిశీలిస్తున్నామనీ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిని సారించామని శివధర్‌రెడ్డి అన్నారు. మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి మహాదేవప్పను ఒక మంత్రి బెదిరించిన కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడనే ఆరోపణలను ఆయన దృష్టికి విలేకరులు తీసుకురాగా.. ఆ ఘటనపై కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షుణ్ణంగా దర్యాప్తు జరుపుతున్నామనీ, ఇతర ఆరోపణలేవీ తన దృష్టికి రాలేదని డీజీపీ జవాబిచ్చారు. మున్సిపల్ పోలింగ్ పూర్తయ్యాక 130 స్ట్రాంగ్ రూమ్‌లలో బ్యాలెట్ బాక్స్‌లను భద్రపర్చి కట్టుదిట్టమైన సెక్యూరిటీని ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. పోలింగ్ రోజున నిబంధనలను అతిక్రమించేవారు ఏ పార్టీ వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో శాంతిభద్రతల విభాగం అదనపు డీజీ మహేశ్ భగవత్ కూడా పాల్గొన్నారు.

# ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్..!



ఖమ్మం :అమృత్ తెలంగాణ: ఇప్పటికీ ఫోన్ టాపింగ్ కొనసాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అప్పటి పరికరాలను భద్రపరిచి ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం దీనిని అత్యంత సీరియస్‌గా తీసుకుంటోందని వెల్లడించారు. పరికరాలు ఎక్కడెక్కడ పెట్టారో ఆరా తీస్తున్నామని తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా చిట్ చాట్ లో ఆయన మాట్లాడారు. ట్యాపింగ్ కోసం ఎక్కడెక్కడ ఎక్విప్‌మెంట్ (పరికరాలు) అమర్చారో ప్రభుత్వం ఇప్పటికే ఆరా తీస్తోందని, విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాస్వామ్య స్వేచ్ఛకు భంగం కలిగిస్తే వదిలిపెట్టం

"ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, జరుగుతోందని అనేక మంది గగ్గోలు పెడుతున్నారు.. ఇది అక్షరాలా నిజం. ఇప్పుడు కూడా కొందరు ఈ అక్రమాలకు పాల్పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం ఎంక్వయిరీ చేస్తోంది. ఎవరు సూత్రధారులు? ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారు? అనేది బయటకు తీస్తాం. చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులను ఓట్లు అడగ డటంలో తప్పేముందని, తన పార్టీ తరపున తాను అడిగానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు 80శాతం పైగా సీట్లు

రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించబోతోందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. "గడిచిన రెండేళ్లలో మేం చెప్పిన ప్రతి మాటనూ నిలబెట్టుకుని ప్రజలకు చేరువయ్యాం. అందుకే పురపాలక ఎన్నికల్లో 80 శాతానికి పైగా స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోబోతోంది. ఇది జీర్ణించు కోలేకే ప్రతిపక్ష నాయకులు ఆక్రోశం వెళ్లగక్కు తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ విసిరిన సవాళ్లను ప్రజలు తిప్పికొట్టారు.. అదే ఫలితం ఈ ఎన్నికల్లోనూ పునరావృతం కాబోతుంది" అని అన్నారు.

అభివృద్ధికి పెద్ద పీట

గత ప్రభుత్వ తీరుపై పొంగులేటి తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. "కాంగ్రెస్ అధికారం లోకి వచ్చే నాటికి ధనిక తెలంగాణను రూ. 8.19 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు. నెలకు రూ. 6,300 కోట్లు కేవలం అప్పులకే కడుతూ కూడా సంక్షేమాన్ని ఆపలేదు. గత దొరల పాలనలో పేదలను విస్మరిం చారు. 62 వేల డబుల్ బెడ్ రూంలను మొండి గోడలుగా మిగిల్చారు. కానీ మేం 4.5 లక్షల ఇందిర మ్మ ఇండ్లు మంజూరు చేశాం. 'వరి వేస్తే ఉరి' అన్న కాలం పోయి, ఇప్పుడు వడ్లకు బోనస్ ఇస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం" అని వివరిం చారు. మాజీ మంత్రుల అసభ్య పదజాలానికి ప్రజలు ఓటు ద్వారానే తగిన గుణపాఠం చెబు తారని ఆయన పేర్కొన్నారు. గులాబీలకే పథకాలని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ బీఆర్ఎస్ హయాంలో చేసిన వ్యాఖ్యల ఆడియోను ఈ సందర్భంగా వినిపించారు.

అమృత్ తెలంగాణ న్యూస్

ఢిల్లీలో ఒక మల్టీనేషనల్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తూ, లక్షల్లో జీతం తీసుకునే ఒక యువకుడు తన కుటుంబంతో కలిసి వారం రోజుల విహారయాత్ర కోసం లడఖ్ వెళ్లాడు. అక్కడ వారికి కేటాయించిన డ్రైవర్ సుమారు 28 ఏళ్ల యువకుడు. అతనికి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రయాణంలో వారి మధ్య ఈ విధంగా సంభాషణ జరిగింది:

పర్యాటకుడు: "ఈ వీకెండ్‌తో టూరిస్ట్ సీజన్ అయిపోతుంది కదా.. ఆ తర్వాత నువ్వు ఏం చేస్తావు? గోవా, ఢిల్లీ లాంటి పెద్ద నగరాల్లో హోటల్స్ లో పనికి వెళ్తావా?"

డ్రైవర్ (యువకుడు): "లేదు సార్, నేను ఇక్కడే ఉంటాను. లడఖ్ వదిలి నేను ఎక్కడికీ వెళ్లను."

పర్యాటకుడు: "కానీ ఇక్కడ శీతాకాలం చాలా భయంకరంగా ఉంటుంది కదా.. అప్పుడు నువ్వు ఏం చేస్తావు?"

యువకుడు: "పెద్దగా ఏమీ లేదు సార్.. నేను సియాచిన్ వెళ్తాను."

నేను సియాచిన్ వెళ్తాను."

పర్యాటకుడు (ఆశ్చర్యంగా): "సియాచినా? అది ఇక్కడి కంటే ఎంతో చలిగా ఉంటుంది కదా!"

యువకుడు: "అవును సార్, నేను అక్కడ భారత సైన్యానికి 'లోడర్' (బరువులు మోసేవాడు)గా వెళ్తాను. ఇది కాంట్రాక్ట్ ఉద్యోగం. నా లాంటి కొంతమంది ఇక్కడి నుండి సియాచిన్ బేస్ క్యాంప్ వరకు సుమారు 250 కిలోమీటర్లు నడిచి వెళ్తాము. దానికి 15 రోజులు పడుతుంది. అక్కడ మెడికల్ టెస్టులు చేస్తారు, పాస్ అయితే యూనిఫామ్, బూట్లు, హెల్మెట్ ఇస్తారు. అలా అక్కడ 3 నుండి 4 నెలలు ఉండి పని చేస్తాం."

పర్యాటకుడు: "అక్కడ మీరు చేసే పని ఏమిటి?"

యువకుడు: "మేము సామాగ్రిని మోస్తాం. సైన్యం హెలికాప్టర్ల ద్వారా ఆహారం, ఇతర వస్తువులను జారవిడుస్తుంది. ఆ వస్తువులను మేము వీపున వేసుకుని ఒక పోస్ట్ నుండి మరొక పోస్ట్‌కు చేరవేస్తాం. అదంతా మంచు పలకల (Glaciers) ప్రాంతం. ట్రక్కులు వెళ్లలేవు. స్నో స్కూటర్లు శబ్దం చేస్తాయి, అది శత్రువులకు తెలిసిపోయే ప్రమాదం ఉంది. అందుకే మేము తెల్లవారుజామున 2 గంటలకు బయలుదేరుతాం. టార్చ్ లైట్లు కూడా వాడకూడదు. నిశ్శబ్దంగా, చీకటిలో నడవాలి. అక్కడ గుర్రాలు, గాడిదలు కూడా బ్రతకలేవు. –50డిగ్రీల చలిలో, 18,000 అడుగుల ఎత్తులో ఏ జంతువు ప్రాణాలతో ఉండలేదు."

పర్యాటకుడు: "అక్కడ ఆక్సిజన్ కూడా తక్కువగా ఉంటుంది కదా.. అంత బరువు ఎలా మోస్తారు


యువకుడు: "అందుకే 15 కేజీల కంటే ఎక్కువ బరువు ఇవ్వరు. మేము రోజుకు కేవలం రెండు గంటలు మాత్రమే పని చేస్తాము. మిగిలిన సమయం అంతా శరీరాన్ని ప్రాణాలతో ఉంచుకోవడానికే సరిపోతుంది."

పర్యాటకుడు: "ఇది ప్రాణాలతో చెలగాటం కదా.."

ఆ యువకుడు కాసేపు మౌనంగా ఉండి ఇలా అన్నాడు: "నా స్నేహితులు చాలా మంది తిరిగి రాలేదు. కొందరు మంచు లోయల్లో పడిపోయారు, మరికొందరు శత్రువుల కాల్పుల్లో చనిపోయారు. అన్నిటికంటే పెద్ద ప్రమాదం 'ఫ్రాస్ట్ బైట్' (అత్యధిక చలి వల్ల శరీర భాగాలు కుళ్ళిపోవడం). నిజం చెప్పాలంటే అక్కడ మరణం అనివార్యం అనిపిస్తుంది."

పర్యాటకుడు: "అయితే మీకు జీతం చాలా బాగా ఇస్తారేమో?"

యువకుడు: "నెలకు ?18,000. సైన్యం మా ఖర్చులన్నీ చూసుకుంటుంది. మూడు నెలల్లో నేను 50 వేల వరకు దాచుకోవచ్చు. నా కుటుంబం గడవడానికి అది చాలు. అన్నింటికంటే మించి.. మన దేశం కోసం, మన సైన్యం కోసం ఏదో చేశామన్న తృప్తి మిగులుతుంది."



ఎస్ అమృత్ అమృత్ తెలంగాణ తెలుగు దినపత్రిక ఎడిటర్

ఆ మాట వినగానే ఢిల్లీ నుండి వచ్చిన పర్యాటకుడు నిశ్శబ్దమైపోయాడు. ఏసీ రూముల్లో ఉంటూ, 50 లక్షల ప్యాకేజీ తీసుకుంటున్న తను, ఆ యువకుడి ముందు చాలా చిన్నవాడిగా అనిపించాడు.

మనం నేర్చుకోవాల్సిన పాఠం:

–50°C చలిలో, 18,875 అడుగుల ఎత్తున, మృత్యు నీడలో ఆ యువకుడికి రోజుకు ?600 కూలీ చాలా "పెద్దది"గా కనిపిస్తోంది.

దేశం కోసం ఏదో ఒకటి చేస్తున్నామనే ఆ భావనే వారి జీవితానికి అర్థాన్ని ఇస్తోంది.

సోషల్ మీడియాలో విషం చిమ్మేవారు, నగరాల్లో కూర్చుని ఉపన్యాసాలు ఇచ్చేవారు.. ఆ గడ్డకట్టే చీకటిలో పది నిమిషాలు కూడా నిలబడలేరు.మీ పిల్లలను మాల్స్‌కు తీసుకెళ్లండి, పిజ్జాలు తినిపించండి.. కానీ, ఒకసారి ఈ కథను కూడా వారికి చెప్పండి. ఈ దేశానికి వెన్నెముక ఎవరు అనేది వారికి అర్థం కావాలి.

దేశభక్తి అంటే కేవలం నినాదాలు చేయడం కాదు; అది త్యాగం, క్రమశిక్షణ, బాధ్యత నుండి పుడుతుంది.మనం సుఖంగా పడుకున్నామంటే, అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఆ గడ్డకట్టే మంచులో మన శాంతి కోసం ఎవరో భారాన్ని మోస్తున్నారని గుర్తుంచుకుందాం.

వారు ఉన్నారు కాబట్టే.. మనం ఉన్నాం!

# ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అదిలాబాద్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ అధికారులు దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా స్థానిక టీటీడీసి (ఋణజ) కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరైన ప్రిసైడింగ్ అధికారులు (ఞాలు), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఞూాలు)కు పలు సూచనలు చేస్తూ, సామగ్రి పంపిణీ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు, పేపర్ సీల్స్, స్టేషనరీ కిట్‌లను స్వీకరించే సమయంలోనే సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, లోపాలు గమనించినట్లయితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది కేటాయించిన వాహనాల్లో సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. పోలింగ్ అనంతరం డైరీలు, రిజిస్టర్లు, సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం స్వీకరించేందుకు రిసెప్షన్ కౌంటర్లను పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల అమలులో ఎలాంటి అజాగ్రత్త వహించినా లేదా విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బంది తమ బాధ్యతలను నిష్పక్షపాతంగా, నిబంధనలకు లోబడి నిర్వర్తించాలని సూచించారు. ప్రతి దశలో చెక్‌లిస్టులను అనుసరిస్తూ సామగ్రి స్వీకరణ, పోలింగ్ నిర్వహణ, రిసెప్షన్ ప్రక్రియలను క్రమబద్ధంగా పూర్తి చేయాలని ఆదేశించారు. శాంతియుత, స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు హనుమంతు నాయక్, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాజేశ్వర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, మున్సిపల్ అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు జిల్లా కలెక్టర్ రాజర్షి షా







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి బంజారాల ఆరాధ్య దైవం, ఆధ్యాత్మిక గురువు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో జయంతి ఏర్పాట్లపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచారని, ఆయన జయంతి వేడుకలను గౌరవప్రదంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ నెల 18 న జిల్లాకేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో అధికారికంగా జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గిరిజన తండాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వేడుకల ప్రాంగణాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ రద్దీ నివారణకు అవసరమైన మళ్లింపులు చేపట్టాలని సూచించారు. పార్కింగ్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైద్యశాఖ ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సేవాలాల్ మహారాజ్ బోధనలు, ఆయన సమాజ సేవలను యువతకు తెలియజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం సేవాలాల్ జయంతి వేడుకలకు సంబంధించిన పోస్టర్ ను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పీఓ యువరాజ్ మర్మట్, గిరిజన సంక్షేమ శాఖ, పోలీస్ శాఖల అధికారులు, బంజారా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు 1000 మందితో భారీ బందోబస్తు

**మూడు మున్సిపాలిటీ పరిధిలో 80 వార్డులకు,244 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు**

**48 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు,37 అతి సమస్యాత్మక పోలింగ్ లొకేషన్ల పై ప్రత్యేక దృష్టి**

**శాంతియుత ఎన్నికలే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం**

**ఎన్నికల విధుల గురించి పోలీసు అధికారులకు, సిబ్బందికి దిశా నిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్**



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల


హాజరైన పోలీసు అధికారులు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించడమే ప్రధాన లక్ష్యంగా నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా లిఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ...

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సుమారు 1000 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భైంసా, నిర్మల్ పట్టణంలో పోలీసు ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బందికి మార్గదర్శకం చేశారు.ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 80 వార్డులకు 244 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు.ఈ ఎన్నికల సందర్భంగా 48 సమస్యాత్మక పోలింగ్ లొకేషన్లు,37 అతి సమస్యాత్మక పోలింగ్ లొకేషన్లపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో సీఆర్‌పీసీ 144 సెక్షన్ అమల్లో ఉందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ హెచ్చరించారు. పోలింగ్ రోజు అక్రమ మద్యం, డబ్బు పంపిణీ, ప్రలోభాలు, బెదిరింపులు వంటి వాటిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ సెంటర్లు, ప్రధాన రహదారులు మరియు సమస్యాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా వచ్చే ఫుటేజ్‌ను కంట్రోల్ రూమ్ నుంచి 24ఐ7 పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే స్పందించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతా భావన పెంచుతున్నామని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. "ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఏవైనా అనుమానాస్పద ఘటనలు, నిబంధనల ఉల్లంఘనలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. శాంతియుత ఎన్నికల నిర్వహణలో ప్రజల సహకారం అత్యంత కీలకం" అని జిల్లా ఎస్పీ లిడా.జి.జానకి షర్మిల విజ్ఞప్తి చేశారు.

# మున్సిపాలిటీ ఎన్నికకు పోలీసు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి.

**1000 సిబ్బందితో పోలీసు బందోబస్తు ప్రక్రియ.**
**పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు.**
**35 క్రిటికల్ పోలింగ్ స్టేషన్ లలో స్టాటిక్ ఫోర్స్, స్పెషల్ పార్టీ బలగాలు**
**ఇప్పటివరకు పట్టణం లో 200 వ్యక్తులు బైండోవర్**
**80 మద్యం కేసులు నమోదు**
**దాదాపు 30 లక్షల నగదు స్వాధీనం**
**20 ఆయుధాల సేఫ్ డిపాజిట్**
**బందోబస్తులో పాల్గొననున్న ఫారెస్ట్, టిజిఎస్పి, ఏసీబీ, జైళ్ల శాఖ, లీగల్ మెట్రాలజీ, ఎలక్ట్రిసిటీ, ఆర్టిసి, సిబ్బంది**
**పోలింగ్ స్టేషన్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, రూట్ మొబైల్స్ లతో బందోబస్తు ఏర్పాటు.**
**మున్సిపాలిటీ పరిధిలో 49 వార్డులకు ఎన్నికలు**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**


మాట్లాడుతున్న అదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్


హాజరైన పోలీసు అధికారులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నందు జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు జిల్లా పోలీసు వ్యవస్థ పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలియజేశారు. జిల్లా కేంద్రం నందు గల మున్సిపాలిటీ పరిధిలో 49 వార్డుల నందు ఎన్నికలు జరగనుండగా, అందులో 14 రూట్లుగా విభజించి, 62 పోలింగ్ లొకేషన్స్ మరియు 216 పోలింగ్ బూత్ లు ఉన్నాయి. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1000 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. ఇప్పటివరకు జిల్లా ఎస్పీ స్వయంగా పట్టణంలోని పలువు సమస్య ఆత్మక ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహించి, ప్రజలను ఓటు హక్కు పై అవగాహన కల్పించి నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రలోభాలకు గురి కాకూడదని తెలిపారు. ఈరోజు నుండి పోలింగ్ స్టేషన్లో పరిధిలో 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, ప్రజలు గుమ్మిగూడి ఉండకుండా, గొడవలకు అల్లర్లకు దారి తీయకుండా ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకొని, ఇళ్లకు చేరుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సమస్యలు సృష్టించేటటువంటి వారిని, ఎన్నికలను గొడవలు సృష్టించే వారిని 200 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 20 మంది వద్ద ఉన్న ఆయుధాలను సేఫ్ డిపాజిట్ చేయడం జరిగిందన్నారు. ఈ బందోబస్తు నందు 53 మంది ఫారెస్ట్, టిజిఎస్పి, ఏసీబీ, జైళ్ల శాఖ, లీగల్ మెట్రాలజీ, ఎలక్ట్రిసిటీ, ఆర్టిసి, సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికలలో 35 క్రిటికల్ పోలింగ్ లొకేషన్స్ ఉండగా అందులో ప్రత్యేకంగా 40 సీఐ మరియు ఎస్ఐ స్థాయి అధికారులచే స్టాటిక్ ఫోర్స్ తో మరియు స్పెషల్ పార్టీ బలగాలచే బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బందోబస్తు ప్రక్రియలో పోలింగ్ స్టేషన్లో, 14 రూట్ మొబైల్స్ లో, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటుచేసి ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ బందోబస్తు నందు ముగ్గురు అదనపు ఎస్పీలు, 3 డిఎస్పీలు, 21 మంది సీఐలు, 48 ఎస్సై లతో, మహిళా సిబ్బంది, హోంగార్డ్స్, రిజర్వ్ సిబ్బంది, సాయుధ సిబ్బంది, స్పెషల్ పార్టీ బలగాలచే బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. 10 వార్డులకు ఒక అదనపు ఎస్పి, డిఎస్పి స్థాయి అధికారులచే ప్రత్యేకంగా పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని 100 మీటర్ల వద్ద 200 మీటర్ల వద్ద ప్రత్యేక నియమ నిబంధనలు ఉంటాయని వాటిని పాటించాలని, ప్రజల అనవసరంగా గుమిగూడి ఉండరాదని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలలోనికి సెల్ఫోన్లు, వాటర్ బాటిల్ లు, ఇంకు బాటిల్లు, ఆయుధాలు, పెన్నులు, అగ్నికి సంబంధించిన వాటికి అనుమతులు ఉండవని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్ పద్ధతిని పాటించి పోలీసులకు సహకరించాలన్నారు.

పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కేంద్రాలలోనికి అనుమతి ఇస్తారని తెలిపారు. తమ వెంట ఓటర్ ఐడి కార్డులను, గుర్తింపు కార్డులను తెచ్చుకోవాలి.

వాట్సాప్ నందు సోషల్ మీడియా నందు ఇతరులకు రెచ్చగొట్టేలా కించపరిచేలా పోస్టులు పెట్టిన వారిపై పోలీసు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ప్రచారాలు ముగిసిన సందర్భంలో బయట వ్యక్తులు గ్రామాలలో ఉండరాదు.

ఎలాంటి సమాచారం అయినా డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని, గొడవలకు, అల్లర్లకు పాల్పడకూడదు .

ఎన్నికలు పూర్తయిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, అధికారుల అనుమతితో నిర్ధారించిన రోజులలో అనుమతి తీసుకుని నిర్వహించుకోవాలి.

టపాకాయలు పేల్చరాదు.

సున్నితమైన ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహిస్తూ ప్రజలలో పోలీసుల పట్ల ధైర్యం నమ్మకం పెంపొందించేందుకు కృషి చేయడం జరిగిందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేయడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం కఠినమైన చర్యలతో విధులను నిర్వర్తిస్తుందని తెలిపారు. ఎలాంటి సమాచారం అయినా డయల్ 100 ద్వారా పోలీసు సహాయాన్ని సంప్రదించవచ్చు అదేవిధంగా డబ్బు, మద్యం, బహుమతులు లాంటివి పంచే క్రమంలో పోలీసులకు సమాచారం అందించాలి, పోలీసులు వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

49 వార్డుల సంక్షిప్త సమాచారం

62 పోలింగ్ లొకేషన్స్, 35 క్రిటికల్, 27 సాధారణ.

వెయ్యి మంది పోలీసు సిబ్బంది.

14 రూట్స్.

200 మంది బైండోవర్.

20 ఆయుధాల డిపాజిట్.

10 వార్డులకు ఒక అదనపు ఎస్పీ, డిఎస్పి స్తాయి అధికారిచే పర్యవేక్షణ.

మున్సిపల్ ఎన్నికలలో 86 కేసులు నమోదు.

80 మద్యం కేసులలో 378 లీటర్ల మద్యం, రూ 6,19,647 /- విలువ గల మద్యం స్వాధీనం.

29,90,000 నగదు లభ్యం.

5 ఫ్లయింగ్ స్క్వాడ్, 5 స్టాటిక్ చెక్పోస్టులు ఏర్పాటు.

డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, పోలింగ్ కు వేరువేరుగా బందోబస్తు.

150 మంది సాయుధ సిబ్బంది.

40 సీఐ మరియు ఎస్ఐ స్థాయి అధికారిచే స్టాటిక్ ఫోర్స్.

100 స్పెషల్ పార్టీ బలగాలచే ప్రత్యేక బందోబస్తు.

# మొగిలిపేట లో ఇంటింటి ఆరోగ్య సర్వే . గ్రామస్థుల ఆరోగ్యమే ప్రథమం..







మల్లాపూర్ అమృత్ తెలంగాణ ఫిబ్రవరి 10 మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహించడం జరిగింది.ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవడంతో పాటు ఆనారోగ్య సమస్యలు ఏ విధంగా అదిగమించాలో అవగాహన కల్పించారు. సర్పంచ్ గోల్కొండ కళారమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ దండేవేని రాజేందర్, వార్డు మెంబర్లు దండేవేని సోమరాజు, పంచాయితీ కార్యదర్శి గడ్డం సౌజన్య, ,మీనా శ్రీకర్,సునంద, దేవి ప్రసన్న,మరియు anm లు ఆశా కార్యకర్తలు,అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు

# ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

ఆలేరు.అమృత్ తెలంగాణ: క్కసారి అవకాశం ఇస్తే నాలుగో వార్డును అభివృద్ధి చేసి చూపిస్తానని సీపీఐ(ఎం) నాలుగో వార్డు అభ్యర్థి మొరిగాడి భాగ్యలక్ష్మి అజయ్ ప్రజలను కోరారు. మంగళవారం ఆమె నవతెలంగాణ విలేకరితో మాట్లాడుతూ.. ఈరోజు జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సుత్తి-కొడవలి-నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నాలుగో వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నాలుగో వార్డులో అనేక సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకుండా అలాగే ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా తాగునీటి కొరత,డ్రైనేజీ సమస్యలు,సీసీ రోడ్ల లేమి,పారిశుధ్య లోపాలు వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

# మున్సిపల్ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

## నిర్లక్ష్యంపై కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

## బైంసాలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల తనిఖీ


మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


హాజరైన మున్సిపల్ పోలింగ్ అధికారులు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మంగళవారం బైంసాలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ (డిస్ట్రిబ్యూషన్) రిసెప్షన్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి అధికారి తన బాధ్యతను కచ్చితంగా నిర్వర్తించాలని అన్నారు. పోలింగ్ సామగ్రి స్వీకరణ సమయంలో బ్యాలెట్ బాక్సులు, పేపర్ సీల్స్, స్టేషనరీ కిట్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఏవైనా లోపాలు గమనించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన వాహనాల్లోనే నిర్ణీత సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి దశలో చెక్‌లిస్టులను అనుసరిస్తూ క్రమబద్ధంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జనరల్ అబ్సర్వర్ వీరా రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు నిర్వహణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఓటర్లు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సిబ్బంది సహకరించాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ మాట్లాడుతూ, పోలింగ్ ముగిసిన తర్వాత డైరీలు, రిజిస్టర్లు, సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం రిసెప్షన్ కౌంటర్లలో అప్పగించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉన్నాయని చెప్పారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. అనంతరం రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు వాహనాలలో వెళ్తున్న అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమం లో ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# ద్విచక్రవాహనం తప్పించబోయి చెట్టుకు ఢీ కొట్టిన స్కూల్ బస్సు..

## పిల్లలకు తృటిలో తప్పిన ప్రమాదం.






మల్లాపూర్ అమృత్ తెలంగాణ ఫిబ్రవరి 10, మల్లాపూర్ మండలంలోని ఒబులాపూర్ ఎల్లమ్మ ఆలయం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది మెట్ పల్లి నుండి యదావిధిగా వాల్గొండ ,దాంరాజ్ పల్లి ,సంగెం ,ఓబులాపూర్ గ్రామాలకు చెందిన పిల్లల్ని ఇంటికి చేర్చే సమయంలో శ్రీవిజయ సాయి సెంట్రల్ హై స్కూల్ కు చెందిన 36 మందికి పైగా పిల్లలున్న బస్( TG 21 T 1164) ఎదురుగావస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి చెట్టుకు ఢీ కొట్టింది .3వ తరగతి చదువుతున్న హనీష్ అనే బాలుడికి గాయాలయ్యాయి, స్థానికులు అంబులెన్స్ ని పిలిపించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అనంతరం పోలీసులు విచారించి కేసు దర్యాప్తు చేస్తున్నారు . ప్రతి స్కూల్ యాజమాన్యం బస్ ఫిట్ నెస్ చూస్తూ ఉండాలని, డ్రైవర్ మానసిక, ఆరోగ్యం పరిస్థితి గమనించాలి ప్రతి బస్ కు డ్రైవర్ తో పాటు పిల్లల్ని సంరక్షించే ఒక వ్యక్తి ఉండాలని ,అధిక స్పీడ్ తగ్గించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# నిర్మల్ మున్సిపల్ పోరులో ప్రజలు కాంగ్రెస్ వైపు



నిర్మల్ మున్సిపల్ కార్యాలయం

నిర్మల్ జిల్లా ఫిబ్రవరి 10 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు ముగ్గు చూపుతున్న ప్రజలు దానికి కారణం లక్షలలో రేషన్ కార్డులు సన్న బియ్యం ఉచిత విద్యుత్తు ఉచిత బస్సు ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వ ఉద్యోగాలు ఉద్యోగస్తులకు ప్రతినెల ఒకటో తారీకున జీతాలు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంలో అందరికీ స్వేచ్ఛ ఉండడంతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ గా అప్పల గణేష్, చేసిన అభివృద్ధి నిర్మల్ ప్రజలకు అద్దం పడుతుంది అది దృష్టిలో పెట్టుకొని నిర్మల్ అభివృద్ధి వైపు పయనించాలంటే ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్న ఉద్దేశంతో నిర్మల్ ప్రజలు కాంగ్రెస్ వైపు మద్దతు తెలుపుతున్నారు బిజెపి బీఆర్ఎస్ వాళ్లు చెప్పిన మాటలను నమ్మడం లేదు బిజెపి వాళ్లు ధర్మం అంటున్నారు తప్ప ఇప్పుడు ఉన్న బిజెపి ఎమ్మెల్యే నిర్మల్ అభివృద్ధికి ఇప్పటివరకు ఎటువంటి సహకారం అందించలేదని ప్రజలు అంటున్నారు ప్రభుత్వంలో ఉన్న అధికార పార్టీ కౌన్సిలర్లను అధిక మెజార్టీతో గెలిపించాలన్న ఉద్దేశంతో నిర్మల్ ప్రజలు ఏకమై కాంగ్రెస్కు మద్దతు పలుకుతున్నారు

# పట్టణాల్లో పట్టం కాంగ్రెస్ కేనా అవును అనే అంటున్న ప్రజలు.....

**అమృత్ తెలంగాణ ఓటర్ల తీర్పుపై ఆసక్తి**
**కాంగ్రెస్ పై'చేయి' సాధించేనా**
**ప్రభుత్వ వైఫల్యాలపైనే బీఆర్ఎస్ ఆశలు**
**తగ్గుతున్న మోడీ గ్రాఫ్**
**కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులివ్వని బీజేపీ**
**ప్రజా సమస్యలే ఎజెండాగా**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. సోమవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా హోరాహోరీగా ప్రచారం సాగింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సహా బీజేపీ, ఎంఐఎం, సీపీఐ(ఎం), సీపీఐ, ఫార్వర్డ్‌బ్లాక్, జనసేన, బీఎస్పీ అభ్యర్థులు, వారికి అనుకూలంగా ఆయా పార్టీల ప్రధాన నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సోమవారంతో ప్రచారపర్వం ముగిసింది. రాష్ట్రంలోని 116 మున్సిపాల్టీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్లలో బుధవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరగనుంది.

ప్రచార పర్వం ముగియడంతో ఇప్పుడు మున్సిపాల్టీల్లోని ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గుచూపుతారనేది చర్చనీయాంశంగా మారింది. పట్టణ ప్రాంతాల ఓటర్లు కావడంతో ఎవరికి పట్టం కడతారన్న అంశం ఆసక్తికరంగా ఉన్నది. పట్టణాల్లో విద్యావంతులు, మేధావులు, ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగ యువకులతోపాటు పేదలు కూడా గణనీయంగా ఉంటారు. ఎక్కువ మంది చదువుకున్న ఓటర్లుగా ఉండడంతో ఎవరికి మద్దతుగా నిలబడతారనేది కీలకంగా మారింది. దీంతో గెలుపెవరిది?అన్న చర్చ ఊపందుకుంది.

పంచాయతీ ఫలితాలు పునరావృతమయ్యేనా?

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. ఈనెల నాలుగో తేదీ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులంతా మున్సిపాల్టీల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ చేసిన మోసాల గురించి ప్రజలకు చెప్పారు. 12 ఏండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేస్తున్న అన్యాయంపైనా వివరించారు. అయితే స్థానిక సంస్థల్లో ఏ ఎన్నికలు జరిగినా అధికార పార్టీ గెలుపునకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

పంచాయతీ ఎన్నికల ఫలితాలు పునరావృతమవుతాయా?, కాంగ్రెస్ ఆశలు ఫలిస్తాయా?అన్నది వేచిచూడాల్సిందే. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతోపాటు ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. 66 శాతం సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంది. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం వరకు కాంగ్రెస్ అభ్యర్థులే గెలవాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకోసం మంత్రులకు పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలను అప్పగించారు. అధికార కాంగ్రెస్‌కు ప్రజలు ఏ మేరకు అండగా నిలబడతారో ఈనెల 13న ఓట్ల లెక్కింపుతో తేలిపోతుంది.

ప్రభుత్వ వ్యతిరేకతపైనే బీఆర్ఎస్ చూపు

ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతపైనే బీఆర్ఎస్ ఆశలు పెట్టుకుంది. ఆరు గ్యారంటీలు, ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమల్లో వైఫల్యాలను బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు ప్రచార అస్త్రాలుగా ఉపయోగించారు. ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి పాలన వల్ల అన్ని వర్గాల ప్రజలు ఎలా మోసపోయారో వివరించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం పంచాయతీ ఎన్నిక ల్లో బీఆర్ఎస్ 27.64 శాతం సర్పంచ్ స్థానాలను గెలిచింది. బీఆర్ఎస్ లెక్కల ప్రకారం 40 శాతం సీట్లు సాధించినట్టు ప్రకటించింది.

అసెంబ్లీ ఎన్నికల తర్వాత పంచాయతీ ఎన్నికల్లో సాధించిన విజయంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొంత జోష్ నెలకొంది. అయితే 2020లో బీఆర్ఎస్ హయాంలో 120 మున్సిపాల్టీలకు ఎన్నికలు జరిగాయి. అందులో బీఆర్ఎస్ 112 (93.33 శాతం), కాంగ్రెస్ 4 (3.33 శాతం), బీజేపీ 2 (1.67 శాతం), ఎంఐఎం 2 (1.67 శాతం) గెలుపొందాయి. పది మున్సిపల్ కార్పొరేషన్లలో బీఆర్ఎస్ 9 (90 శాతం), కాంగ్రెస్–బీజేపీ కలిపి 1 (10 శాతం) మణికొండలో గెలిచాయి. పట్టణ ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంకు బలంగానే ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీని ప్రజలు ఏమేరకు ఆదరిస్తారో వేచిచూడాల్సిందే.

ప్రజలను ఆకర్షించని బీజేపీ

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలను బీజేపీ ఆకర్షించలేకపోయింది. ఈనెల ఒకటిన ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులను కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను పెడచెవిన పెట్టింది. విభజన హామీలను విస్మరించింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణకు వచ్చినా ఏం చేశారో, నిధులు ఏం ఇచ్చారో చెప్పే పరిస్థితి లేదు. కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలతోపాటు అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో ప్రధాని మోడీ గ్రాఫ్ తగ్గింది.

ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నించడం, కార్మికుల హక్కులను హరించేలా లేబర్ కోడ్‌లను తేవడం, విద్యుత్ సవరణ బిల్లు నిర్ణయాలతో కేంద్రంలోని బీజేపీ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నది. ఆ ప్రభావం తెలంగాణలోనూ ఉన్నది. ఇంకోవైపు ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులను తేవడంలో విఫలమయ్యారన్న విమర్శ ఉన్నది. ఇవన్నీ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ పట్ల ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశమున్నది.

ప్రజలు కేంద్రంగా వామపక్షాల ప్రచారం

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కేంద్రంగానే వామపక్షాలు ప్రచారాన్ని నిర్వహించాయి. బూర్జువా పార్టీల తరహాలో వ్యక్తిగత దూషణలు కాకుండా ప్రజా సమస్యలే ఎజెండాగా పనిచేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాయి. సీపీఐ(ఎం), సీపీఐ అభ్యర్థులు గెలిస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్న విషయాన్ని ఓటర్ల దృష్టికి తీసుకెళ్లాయి.



డాక్టర్ కే ఎల్ రాములు అమృత్ తెలంగాణ తెలుగు దినపత్రిక నిర్మల్ నిజాంబాద్ బ్యూరో ఇంచార్జ్

# మా భూములకు నష్ట పరిహారం అందించండి

## కాళేశ్వరంలో భూములు కోల్పోయిన రైతులు తాసిల్దార్ శ్రీకాంత్ కు వినతి పత్రం......



నర్సాపూర్ జి తాసిల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న గొల్లమాడ రైతులు

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి ఫిబ్రవరి10 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని గొల్లమడ గ్రామ రైతుల భూములు కాలేశ్వరం కాల్వ నిర్మాణంలో దాదాపు పదిమంది రైతులయి పోవడంతో వారికి ఇప్పటివరకు నష్టపరియం చెల్లించకపోవడంతో మంగళవారం నర్సాపూర్ జి తాసిల్దార్ శ్రీకాంత్, కు వినతి పత్రం అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గొల్ల మాడ రైతులు పాల్గొన్నారు

# ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా




ఆలేరు రూరల్ : ఒక్కసారి అవకాశం ఇస్తే నాలుగో వార్డును అభివృద్ధి చేసి చూపిస్తానని సీపీఐ(ఎం) నాలుగో వార్డు అభ్యర్థి మొరిగాడి భాగ్యలక్ష్మి అజయ్ ప్రజలను కోరారు. మంగళవారం ఆమె నవతెలంగాణ విలేకరితో మాట్లాడుతూ.. ఈరోజు జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సుత్తి–కొడవలి–నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నాలుగో వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నాలుగో వార్డులో అనేక సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకుండా అలాగే ఉన్నాయని ఆమె పేర్కొన్నారు.

ముఖ్యంగా తాగునీటి కొరత,డ్రైనేజీ సమస్యలు,సీసీ రోడ్ల లేమి,పారిశుధ్య లోపాలు వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం పోరాడతానని స్పష్టం చేశారు. ప్రజలతో మమేకమై పనిచేస్తూ,వార్డు అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తానని తెలిపారు. ప్రజల అవసరాలను ముందుగా తెలుసుకొని ప్రాధాన్యత ఆధారంగా అభివృద్ధి పనులు చేపడతానని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించి తర్వాత మాయమయ్యే నాయకులు కాకుండా,ప్రజల మధ్యే ఉంటూ ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుగా నిలబడతానని అన్నారు.

అలాగే వార్డులో పరిశుభ్రత నిర్వహణను మెరుగుపరచి,చెత్త సేకరణ వ్యవస్థను పటిష్టం చేస్తామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ పథకాలు అందే విధంగా కృషి చేస్తామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో అవినీతి లేకుండా

పారదర్శకతతో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని,ప్రజల సమస్యలు పరిష్కరించే నిజమైన నాయకులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఓటరుపై ఉందని ఆమె అన్నారు.

ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతూ వార్డు అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని పేర్కొంటూ,నాలుగో వార్డు ప్రజలు ఈ ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. చివరగా నాలుగో వార్డు ప్రజలు ఈరోజు జరిగే ఎన్నికల్లో సుత్తి–కొడవలి–నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె మరోసారి విజ్ఞప్తి చేశారు.

# కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు రాష్ట్రానికి భారంగా మారాయి

రాయికల్ :అమృత్ తెలంగాణ: రాయికల్ మండలంలోని వీరాపూర్ గ్రామంలో రూ.10 లక్షల ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నిధులతో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి రూ.10 లక్షల చొప్పున రెండు పనులకు,అలాగే రూ.30 లక్షలతో ఒక గోదాం మంజూరు చేస్తుందని తెలిపారు. గ్రామాల మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని, అభివృద్ధి కోసం అధికార పార్టీతో సమన్వయంతో ముందుకెళు_న్నానని పేర్కొన్నారు.



అనంతరం కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును విబిజి రామ్ (వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ్)గా మార్చి కఠిన నిబంధనలు అమలు చేయడం సరికాదన్నారు. గాంధీ పేరు స్థానంలో రాముని పేరు పెట్టారని వ్యాఖ్యానించిన ఆయన, రామరాజ్యం అంటే ప్రజలకు మేలు చేయాల్సిందే కానీ నష్టపరిచే విధంగా ఉండకూడదన్నారు. పేరుకే 100 నుంచి 125 పని దినాలు పెంచినట్లు చెప్పడం ఆచరణలో అసాధ్యమని ఎద్దేవా చేశారు.

పేరు మార్పుపై తనకు అభ్యంతరం లేదని, కానీ ఉపాధి హామీ పథకంలో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నిబంధనలు తప్పనిసరిగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నిబంధనల వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు, మధ్యతరగతి, భూమిలేని కూలీల కోసం తీసుకొచ్చిన ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రం ఏదో ఒక రూపంలో నిధులు ఇస్తూ, తెలంగాణలో మాత్రం ఈ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణ కూలీల పక్షాన విబిజి రామ్ పథకాన్ని పూర్తిగా ఖండిస్తున్నానని స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్రం కేంద్రానికి జీఎస్టీ రూపంలో భారీగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన 40 శాతం నిధులపై నిబంధనలు విధించడం అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.చిరంజీవి, తహసీల్దార్ నాగార్జున, సెర్ప్ ఏపీఎం నరహరి, సర్పంచ్ దిండిగల గంగు, ఉపసర్పంచ్ దుంపల నర్సారెడ్డి, మాజీ ప్యాక్స్ చైర్మన్ రాజరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ రావు, నాయకులు రామస్వామి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న పంట ఎండుతోంది

బోనకల్ : అమృత్ తెలంగాణ: బోనకల్ బ్రాంచ్ కెనాల్(బీబీసీ) కింద సాగుచేసిన సుమారు 3000 ఎకరాలలో మొక్కజొన్న పంట ఎండిపోతుందని కెనాల్ పరిధికి చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రైతులు తమ సరిహద్దుల ప్రాంతాల్లో విడివిడిగా రాస్తారోకో నిర్వహించారు. చివరికి ఖమ్మం సీఈవో రమేష్ బాబు రైతులతో మాట్లాడి ఆందోళన విరమించారు. ఖమ్మం జిల్లా బోనకల్, మధిర మండలాలకు చెందిన మోటమర్రి, గోవిందాపురం(ఏ), ముడుపల్లి, అల్లినగరం గ్రామాల రైతులు వైరా-జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. బోనకల్ సబ్ డివిజన్ డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లు ఉద్దేశపూర్వకంగానే దాములూరు మేజర్‌కు సాగర్ నీటిని విడుదల చేయటం లేదని ఆంధ్ర రాష్ట్రానికి చెందిన వత్సవాయి, పోలంపల్లి, ఖమ్మంపాడు, వేముల నర్వ, వేములగడ్డ తదితర గ్రామాల రైతులు వైరా -- జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై ఆంధ్ర తెలంగాణ సరిహద్దులో రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. వీరి ఆందోళనతో వత్సవాయి ఎస్సై పి. ఉమా మహేష్, జగ్గయ్యపేట ఎన్ఎస్పీ డీఈ చంద్రశేఖర్, ఏఈ ప్రసన్నలక్ష్మి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతులు వడ్లమూడి రాంబాబు, వత్సవాయి సాగునీటి డీసీ అధ్యక్షుడు చిట్టూరి సుభాష్, రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా నాయకులు చిరుమామిళ్ల హనుమంతురావు, మండేపూడి చంద్రశేఖర రావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బొడ్డు రాముతో వారు చర్చలు జరిపారు. తమకు స్పష్టమైన హామీ ఇచ్చేవరకూ ఆందోళన విరమించేది లేదని రైతులు స్పష్టం చేశారు. డీఈ



చంద్రశేఖర్, బోనకల్ సబ్ డివిజన్ డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లుకు, కల్లూరు ఎస్ఈ వాసంతికి ఫోన్లో రైతుల సమస్యను వివరించారు.

తాము దాములూరి మేజర్‌కు నీటిని విడుదల చేయబోమని, పదేపదే డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లుకు చెబుతున్నా తమ మాటను లెక్కచేయడం లేదని వాసంతి సమాధానం చెప్పారు. దీంతో రైతులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఆంధ్ర ప్రాంత రైతులం కావడం వల్లే డీఈ ఉద్దేశపూర్వకంగానే నీటిని విడుదల చేయడం లేదని, తమకు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని అన్నారు. కృష్ణా జిల్లా ఎస్ఈతో ఫోన్లో మాట్లాడారు. దీంతో ఆయన ఖమ్మం సీఈఓతో మాట్లాడి సాగర్ నీరు వచ్చే విధంగా ప్రయత్నిస్తానని ఆందోళన విరమించాలని రైతులను కోరడంతో అందుకు రైతులు అంగీకరించారు. వత్సవాయి ఎస్ఐ ఉమా మహేశ్ కృషితో రైతులు తమ ఆందోళన విరమించారు. తెలంగాణ రైతులు రెండు గంటలపాటు ఆందోళన చేసినా బోనకల్ సబ్ డివిజన్ డీఈ గానీ, ఇతరులు గానీ సంఘటనా స్థలానికి రాలేదు. చివరకు ఆంధ్ర రైతులు ఆందోళన విరమించిన తర్వాత తెలంగాణ రైతులకు మద్దతుగా నిలిచారు. తెలంగాణ రైతుల ఆందోళన విషయాన్ని ఖమ్మం ఈఈ మధు, ఎస్ఈలు వాసంతి, వెంకటేశ్వర్లు దృష్టికి ఫోన్ ద్వారా ఆంధ్ర రైతులు తీసుకెళ్లారు. అయితే వీరి నుంచి స్పష్టమైన సమాధానం రాలేదు. తాము 3000 ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశామని 15 రోజుల నుంచి సాగర్ నీరు రాక పంటలు ఎండిపో తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బోనకల్ ఎస్సై పోదిలి వెంకన్న రైతులతో ఫోన్లో మాట్లాడారు. సుమారు రెండున్నర గంటల పాటు రైతుల ఆందోళన కొనసాగుతున్నా నీటిపారుదల శాఖ అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడంతో అల్లినగరం గ్రామానికి చెందిన రైతు శాఖమూరి కోటేశ్వరరావు పురుగుల మందు తాగే యత్నం చేయగా సహచర రైతులు వారిం చారు. మండుటెండలో పంటలను కాపాడాలని తాము ఆందోళన చేస్తుంటే అధికారులు పట్టించుకోరా అంటూ ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. దీంతో బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు 1300 క్యూసెక్కుల నీటిని సాయంత్రం వరకు విడుదల చేయిస్తానని రైతులు తమ ఆందోళన విరమించాలని ఖమ్మం సీఈవో రమేష్ బాబు కోరారు. రైతుల పంటలు పూర్తిగా తడిసే వరకు నీటిని కొనసా గిస్తామని హామీ ఇచ్చారు. దీంతో తెలంగాణ అన్నదాతలు తమ ఆందోళన విరమించారు. ఈ ఆందోళనతో వత్సవాయి వరకు సుమారు రెండు కిలోమీటర్లు, బోనకల్ వైపు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు భారీగా నిలవడంతో రాకపోకలు స్తంభించిపోయాయి.

# వీరాపూర్ లో శంకుస్థాపన వేదికపై సమస్యల ప్రస్తావన

రాయికల్ :అమృత్ తెలంగాణ: మండలంలోని వీరాపూర్ గ్రామంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి వచ్చిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్‌కు గ్రామస్తులు తమ సమస్యలను వినిపించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో మరుగుదొడ్లు లేకపోవడంతో గ్రామానికి వచ్చే ప్రభుత్వ సిబ్బంది, అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే గ్రామానికి అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని, ఓ వార్డులో డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో మురికి నీరు రోడ్డుపైకి వస్తోందని తెలిపారు. ఎల్లమ్మ ఆలయం వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ అవుతుండటంతో తక్షణమే మరమ్మతులు చేయాలని, మైనారిటీలకు ఫంక్షన్ హాల్ నిర్మించాలని గ్రామ మహిళలు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీని వెంటనే మరమ్మతులు



చేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు బస్సు సర్వీస్ పునరుద్ధరణ కోసం రవాణా శాఖ మంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.


# జూ. అతిలోక సుందరి సమ్మోహనం



మరోవైపు జాన్వీ కపూర్ నిరంతర ఫోటోషూట్లు వెబ్ లో వైరల్ గా మారుతున్నాయి. బాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కి జాన్వీకపూర్ ప్రయాణం గురించి తెలిసినదే. జాన్వీ సౌత్ లోను వేవ్స్ క్రియేట్ చేస్తోంది. కెరీర్ ఆరంభమే టాలీవుడ్ లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన నటించే అవకాశం అందుకుంది. దేవర లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తో ఘనమైన ఎంట్రీ ఇచ్చింది. ఇప్పుడు మగధీర రామ్ చరణ్ సరసన క్రేజీగా స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ మూవీలో నటిస్తోంది. ఈ సినిమాలో తనకు నటిగా నిరూపించుకునే ఆస్కారం బుచ్చిబాబు కల్పించాడని టాక్ వినిపిస్తోంది. షూటింగుల కోసం జాన్వీ హైదరాబాద్ కి వచ్చి వెళుతోంది. ఇటీవల ముంబై టు హైదరాబాద్ ప్రయాణాలతో బిజీ బిజీగా ఉంది.

# నీ వల్లే నీ వల్లే ఈ మాయే నీ వల్లే.. సిద్ శ్రీరామ్ మార్క్..!

మోహన్ శ్రీవత్స డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. కొత్తగా ఏది ప్రయత్నించినా సరే తెలుగు ఆడియన్స్ అలాంటి సినిమాలను భుజాన వేసుకుని సక్సెస్ చేస్తారు. కాన్సెప్ట్ సినిమాలకు ఉన్న డిమాండ్ అది. అందుకే కొత్త కథ ఉంటే చాలు దానికి తగినట్టుగా సినిమా వైబ్ ని క్రియేట్ చేసి దానికి తగిన ప్రమోషన్స్ ని చేస్తున్నారు. యువ దర్శకులు తమకు వచ్చిన ఛాన్స్ ని అన్ని విధాలుగా యూజ్ చేసుకుంటున్నారు. ఇక అలాంటి యువతరం కథతో కొత్త పాయింట్ తో వస్తున్నారు త్రిబాణధారి బార్బరిక్. మోహన్ శ్రీవత్స డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాను వానర సెల్యూలాయిడ్ బ్యానర్ పై విజయపాల్ రెడ్డి నిర్మిస్తున్నారు. వశిష్ట ఎన్ సింహా, సత్యరాజ్, సాంచి రాయ్, సత్యం రాజేష్, క్రాంతి కిరణ్, ఉదయ భాను ఇంపార్టెంట్ రోల్స్ లో నటిస్తున్నారు. త్రిబాణధారి బార్బరిక్ సినిమా మోషన్ పోస్టర్ ఫస్ట్ గ్లింప్స్ తోనే ఆడియన్స్ లో ఒక ఇంట్రెస్ట్ ని క్రియేట్ చేసింది. ఇక ఈ సినిమా నుంచి లేటెస్ట్ గా నీవల్లే నీవల్లే అనే సాంగ్ రిలీజ్ చేశారు. రఘురాం లిరిక్స్ అందించిన ఈ సాంగ్ ను స్టార్ సింగర్ సిద్ శ్రీరామ్ ఆలపించారు. సిద్ శ్రీరామ్ పాట పాడితే ఆ మ్యాజిక్ ఎలా ఉంటుందో తెలిసిందే. దానికి ఏమాత్రం తగ్గకుండా ఈ సాంగ్ ఉంది. 'తండేల్' సాంగ్ వీడియో కూడా యూత్ ఆడియన్స్ కి కనెక్ట్ అయ్యేలా ఉంది.



ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ గా రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమాకు కుశేందర్ రమేష్ రెడ్డి కెమెరా మెన్ గా పనిచేస్తుండగా ఇంఫ్యూజన్ బ్యాండ్ ఈ సినిమాకు సంగీతం అందించారు. సినిమా టైటిల్ ఇంకా కాన్సెప్ట్ కొత్తగా ఉండేలా ఉంది కాబట్టి తెలుగు ఆడియన్స్ ఈ సినిమాను ఆకట్టుకునే ఛాన్స్ ఉంది. త్రిబాణధారి బార్బరిక్ టైటిల్ తోనే ఆడియన్స్ అటెన్షన్ రాబట్టిన మేకర్స్ సినిమా ప్రమోషన్స్ సాంగ్స్ తో మరింత బజ్ పెంచాలని చూస్తున్నారు. లేటెస్ట్ గా సినిమా నుంచి రిలీజైన సిద్ సాంగ్ మాత్రం మ్యూజిక్ లవర్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది.

# రేటు పెంచేసిన ఐశ్వర్యా రాజేష్

కోలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తనని తాను నిలదొక్కుకుంది. టాలీవుడ్ లో తెలుగమ్మాయిలకు ఛాన్సులివ్వరని, ఇచ్చినా నిర్మాతలు చాలా కండిషన్స్ పెడతారని అంటుంటారు సీనియర్ హీరో రాజేష్ కూతురిగా ఇండస్ట్రీలోకి అడుగపెట్టిన ఐశ్వర్యా రాజేష్ పేరుకే తెలుగమ్మాయి కానీ అమ్మడు ఎక్కువ తమిళ సినిమాలే చేస్తుంటుంది. కోలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తనని తాను నిలదొక్కుకుంది. టాలీవుడ్ లో తెలుగమ్మాయిలకు ఛాన్సులివ్వరని, ఇచ్చినా నిర్మాతలు చాలా కండిషన్స్ పెడతారని అంటుంటారు. అందుకే ఐశ్వర్య కోలీవుడ్ వెళ్లి అక్కడ సినిమాలు చేసుకుంటూ సెటిలైంది. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండే ఐశ్వర్యా రాజేష్ తన తండ్రి లెగసీని తెలుగులో కంటిన్యూ చేయాలనుకుంది కానీ అనుకున్న విధంగా ఆమెకు



అవకాశాలు దక్కక కోలీవుడ్ కు వెళ్లి అక్కడ కెరీర్ ను స్టార్ట్ చేసి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తన టాలెంట్ తో దాదాపు 50 సినిమాల్లో నటించిన ఐశ్వర్యా రాజేష్,

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# సూపర్ హాట్ లో నేహాశర్మ కైపెక్కిస్తుందే!



నేహా శర్మ అందాల సరాగాల గురించి చెప్పాల్సిన పనిలేదు. బ్యూటీ సామాజిక మాధ్యమాల్లో వెల్లువలా విరుచుకుపడుతుంది. ఇన్ స్టాగ్రామ్.. ట్విట్టర్ వంటి మాధ్యమాల్లో రెగ్యులర్ గా టచ్ లో ఉంటోంది. నిరంతర ఫోటోషూట్లతో సెల్ఫీ షూట్లతో హీటెక్కిస్తుంటుంది. గడిపేస్తోంది. యూత్లో ఎప్పటికప్పుడుడు చర్చకొస్తుంటుంది. రేర్ గా సిస్టర్ ఐశాశర్మతోనూ ఫోటో సెషన్స్ లో పాల్గొంటోంది. అక్కా-చెల్లి ఇద్దరు కలిసి అందాల దాడికి దిగారంటే? ఆ కథ వేరుగా ఉంటుంది. అయితే ఈసారి అంతటి సాహసానికి పూనుకోలేదు. నేహా శర్మ సోలోగానే అందాల విందు చేసింది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com